


# 'పందెం'

- ప్రతాప వెంకట సుబ్బారాయుడు

మాధవరాజ్యంలో స్రవంతుడు పందాలు కట్టి గెలవడంలో సిద్ధహస్తుడు. ఇదీ అదీ అని లేకుండా ఏ విషయంలోనైనా, ఎప్పుడైనా పందెం కట్టి గెలిచేవాడు. అతనితో పందెం కట్టాలంటే అందరూ ఎంతో భయపడేవారు. ఒకవేళ ఎవరైనా ధైర్యం చేసి పంతంకొద్దీ ముందు కొచ్చినా, స్రవంతుడు చేతిలో ఓడిపోయి బిక్కుముఖం వేసేవారు.

ఒకసారి ఊళ్ళో బరువైన బండరాయిని ఎవరు ఎత్తగలరు? అన్న విషయంలో మీద పందెం జరుగుతుంటే, రక్షక భటులు వచ్చి స్రవంతుడిని బంధించి చెఱశాలలో వేశారు. ఆ దేశంలో జూదం, పందెం నిషేదం.

మరుసటి రోజు స్రవంతుడిని సభలో రాజుగారి ముందు ప్రవేశపెట్టి, అతడు చేసిన నేరం చదివారు. అది శ్రద్ధగా విన్న రాజు స్రవంతుడితో నీ గురించి విన్నాక, నువ్వు పందేలు బాగా కాస్తానని, ఒక్కసారి కూడా ఓడలేదని తెలిసింది అంత సమర్ధత ఎలా సాధించావు? పందాల్లో ఇంతగారాణించావంటే

నువ్వు చదువుకున్నవాడివి, తెలివైనవాడివి అయి వుండాలి. అలాంటప్పుడు ఈ పందాలు కాయడమేమిటి' అన్నాడు.

'రాజా, నేను గురువు శ్రీ కోదండాచార్యులగారి వద్ద విద్యనభ్యసించాను. ఆయన గొప్పతనం మీకు తెలియంది కాదు. నేను సకల శాస్త్రాల్లో ప్రావీణ్యం సంపాదించానంటే అది ఆయన చలవే. నాకు తర్క శాస్త్రమంటే ప్రాణం. ఎందుకంటే అందులో అన్ని శాస్త్రాలు పరిజ్ఞానం వుంటుంది. ఆసక్తిగా దానిలో విశేష కృషి చేశాను. ఉన్నత స్థానంలో ఉత్తీర్ణుడనయ్యారు. మీ ఆస్థానంతో పాటు బయట అన్నిచోట్లా కొలువు కోసం ప్రయత్నించాను. దొరకలేదు. అందుకే కడుపు నింపుకోవడానికి నా తెలివి తేటలతో ఈ పందెం మార్గాన్ని ఎంచుకున్నాను. పందెం అంటే గెలుపు ఓటములు దైవాధీనం అన్నట్లు గాలివాటంగా కాకుండా, తర్కంతో సరైన అంచనా వేసి పందాలు కట్టడంతో, గెలుపు సాధ్యమయ్యేది. పందెం కాచే డబ్బు కూడా తక్కువగా, ఎవరికీ బాధ కలగకుండా వుండేది. ఇది జూదం, వ్యసనం లాంటి బలహీనత కాదు నా విషయంలో, కేవలం భుక్తి కోసం. రాజుగారికి నేను చేసింది తప్పనిపిస్తే శిక్షించవచ్చు' అన్నాడు స్రవంతుడు.

'నీ తెలివికి సరైన కొలువిచ్చి దేశాభివృద్ధికి ఉపయోగించుకోకపోవడం నా తప్పు. నిన్ను ఇప్పుడే మా మంత్రి వర్గంలో నియమిస్తున్నాను' సభాజనం హర్షధ్వానాల మధ్య ప్రకటించాడు రాజు.

ఇతరుల తప్పులను ఎంచటంతోనే మునిగి తేలేవాడు తనలోని లోపాలు గుర్తించలేడు.

తనను తాను ప్రేమించడం నేర్చుకుంటే ఇతరులను ద్వేషించటం మానేస్తారు.